క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

జి.సిగడాం: జాడ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు చదువుల అప్పలరాజు, కొత్తకోట జగదీశ్వరరావు, వడ్డిపల్లి రామకృష్ణమ్మ, కొండకు కృష్ణలను గురువారం హెచ్‌ఎం బెవర రామినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యాభివృద్ధికి ఎంతగానో సహకరించారని కొనియాడారు. కార్యక్రమంలో బోనెల గౌరీశ్వరరావు, ఆర్.మోహనరావు, పి.శంకర నారాయణ, మీగడ మల్లికార్జునరావు, జోగేంద్ర తవిటిరాజు, బి.నాగేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, ఎస్.ప్రతిభా భారతి పాల్గొన్నారు.

కనుగులవానిపేటలో కాలువ ధ్వంసం



ధ్వంసమైన కాలువ

శ్రీకాకుళం రూరల్: కనుగులవానిపేటలో ఐదు నెలల క్రితం నిర్మించిన సీసీ కాలువను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని సర్పంచ్ గంగు వెంకటరమణ తెలిపారు. కాలువ నిర్మాణానికి సంబంధించి ఇంకా బిల్లులు మంజూరు కాలేదని, కనీసం ఎంబుక్‌లో కూడా మండల పరిషత్ అధికారులు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం పనులు చేయిస్తే కొంతమంది కక్షపూరితంగా వ్యవహరించి కాలువలను ధ్వంసం చేయడం సరికాదన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమ్యరాగిణి

ఎచ్చెర్ల : వర్షాల సీజన్ కావడంతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పొన్నాడ పీహెచ్‌సీ వైద్యురాలు రమ్యరాగిణి అన్నారు. తోటపాలెంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, పీహెచ్‌ఎన్ సుధ, హెచ్‌ఎస్ డేవిడ్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ సాయిలక్ష్మీ, ఏఎన్‌ఎం కమల, హెల్త్ అసిస్టెంట్ ముత్యాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని తహసీల్దార్ మహాదేవు సరిత సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై వీఆర్‌ఓలు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్‌ఎస్‌డీటీ కె.గాయత్రి, ఆర్‌ఐ ఎ.రాధ, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, పాట్నూరు జగన్నాథం, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కె.వి.సంచాం ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పున్నానపాలెం, తిరుపతిపాలెం, బంటుపల్లి, సీతంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అరసవల్లి: నగరంలోని 11 కె.వి.అరసవల్లి, 11 కె.వి. కలెక్టరేట్ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించే పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అరసవల్లి, కలెక్టరేట్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలు, 80ఫీట్ రోడ్డులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రూ. లక్షలు వ్యయం..

లక్ష్యం శూన్యం



శ్రీకూర్మంలో టీటీడీ దేవస్థానం నిర్మించిన సత్రం



శ్రీకూర్మం మెయిన్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

- శ్రీకూర్మంలో నిరుపయోగంగా టీటీడీ సత్రం
- ఉత్సవాల వేళ భక్తులకు విడిది సౌకర్యం కరువు
- దూర ప్రాంత వాహనాలకు పార్కింగ్ లేక ఇక్కట్లు

గార: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మనాథాలయాన్ని దర్శించుకునే భక్తులకు వసతి సౌకర్యం కరువవుతోంది. స్వామివారికి వేకువజామున జరిగే విశేష అర్చనలతో పాటు విశేష ఉత్సవాలైన డోలోత్సవం, స్వామి కల్యాణోత్సవానికి భక్తులు ఇక్కడికి వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటారు. అయితే ఉత్సవాల్లో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం వేకువజామున జరిగే విశేష అభిషేకాలకు అత్యంత ప్రాధాన్యత ఉండడంతో భక్తులు పలు రాష్ట్రాల నుంచి హాజరవుతుంటారు. కానీ వీరికి వసతి సౌకర్యాలు సక్రమంగా లభించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆలయం వెనుక వైపు పర్యాటక శాఖ నిర్మించిన టూరిజం రిసార్టు భక్తులకు ఉపయోగపడటం లేదు. ఈ భవనాన్ని నిత్యాన్నదాన కేంద్రంగా వినియోగిస్తున్నారు.

వెంటాడుతున్న ట్రాఫిక్ కష్టాలు..

ఆదివారం వస్తే చాలు శ్రీకూర్మంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనాలు ఎక్కడికక్కడ పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల వాహనాలకు పంచాయతీ నుంచి ఆశీలు వసూలు చేస్తున్నా నిలిపేందుకు స్థలం లేకపోవడంతో చాలామంది రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో గంటల కొద్దీ సమయం ట్రాఫిక్ స్తంభించిపోతుంది.

సత్రం వద్ద స్థలాన్ని వాడుకలోకి తీసుకొచ్చి వాహనాలు నిలిపేందుకు ఉపయోగిస్తే సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

శ్రీకాకుళంలో బస..

ఆలయానికి కూతవేటు దూరంలో తిరుమల తిరుపతి దేవస్థానం 1972లో సత్రం నిర్మించారు. అయితే నిర్వహణ లోపం భక్తులకు శాపంగా మారింది. దీంతో దూరప్రాంత భక్తులు సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం పట్టణంలో రాత్రి బస చేయాల్సి వస్తోంది. అక్కడి నుంచి వేకువజామునే ఆలయానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విశాలమైన స్థలంలో నిర్మించిన సత్రంలో పైన కింద నాలుగేసి గదులు, కల్యాణ మంటపం నిర్మించారు. నిర్వహణ బాధ్యతను శ్రీకూర్మనాథాలయానికి అప్పగించారు. కొన్నాళ్ల పాటు కర్మకాండలు చేసేందుకు వచ్చే వారికి గదులు ఇచ్చి అద్దె వసూలు చేసేవారు. అనంతరం నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో సాయంత్రం వేళల్లో మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారింది. ప్రహరీ లేకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సత్రం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



దేశంలోనే ఏకైక క్షేత్రమని పేరున్నా దూర ప్రాంత భక్తులు ఉండేందుకు ఏర్పాట్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. టీటీడీ సత్రం స్థానంలో నూతన భవనం నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలి. ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసేందుకు అనువుగా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి.

– ఎల్.వి.ఎస్ ప్రసాదరావు, శ్రీకూర్మం

ప్రతిపాదనలు పంపుతాం



తిరుమల తిరుపతి దేవస్థానాల నిధులతో నిర్మించిన సత్రం పూర్తిగా పాడైంది. దీనిపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. కొన్నేళ్ల క్రితం మరమ్మతులు చేసేందుకు నివేదికలు పంపగా నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. భక్తుల వసతి ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపుతాం.

– కె.నరసింహనాయుడు, ఈవో, శ్రీకూర్మం

అధికారుల సహకారానికి కృతజ్ఞతలు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న సిరిమాను ఉత్సవ నిర్వాహకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాత శ్రీకాకుళం సిరిమాను కమిటీ సభ్యులు గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండల్కర్‌ను కలిశారు. సిరిమాను ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు. అనంతరం ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిశారు. పోలీసులు ఇచ్చిన సూచనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల భద్రతకు పెద్దగా ఇబ్బంది లేకుండా ఉత్సవాలు నిర్వహించగలిగామని కమిటీ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డి.పి.దేవ్, ముఖ్య సలహాదారు రామలింగేశ్వర స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శంకరరావు, కార్యదర్శి మావూరు శేఖర్, కల్లేపల్లి సోంబాబు, కర్రి రంగాజీ దేవ్, అదపాక రాంబాబు పాల్గొన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

శ్రీకాకుళం అర్బన్: నిత్య సేవకుడు డాక్టర్ గేదెల ఇందిరాప్రసాద్ అని స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్‌క్లబ్ సభ్యులు గురువారం ఇందిరాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జిల్లాలో నిత్యం సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా కళాశాల ఆవరణలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసి యువతకు దిక్సూచిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీజీ గుప్త, బీవీ రవిశంకర్, ఎస్.జోగినాయుడు, గేదెల లక్ష్మి, బి.దేవిప్రసాద్, గోలీ ఉమామహేశ్వరరావు, సంతోష్, జేసీ పట్నాయక్, జ్యోతి, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

జయహో జగన్నాథ..



ఇలిసిపురంలో రామావతారంలో జగన్నాథుడు



గుజరాతిపేటలో సత్యనారాయణ స్వామిగా..

శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని ఇలిసుపురం కూడలిలో జగన్నాథుడిని గురువారం రామావతారంలో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

☛ గుజరాతిపేటలోని జగన్నాథస్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాల్లో స్వామివారిని సత్యనారాయణస్వామి అవతారంలో అలంకరించారు. అర్చకులు పెంట సోదరులు ఆధ్వర్యంలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

☛ పాండ్రంగి వీధిలోని శ్రీరామ మందిరంలో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా స్వామివారిని జగన్మోహిని అవతారంలో అలంకరించారు. అర్చకులు వేదుల ప్రదీప్, ధర్మకర్త నర్సింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

☛ మొండేటి వీధిలోని షిరిడీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సహిత శివకామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా స్వామివారిని శ్రీకృష్ణునిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



మొండేటి వీధిలో శ్రీకృష్ణుడిగా..



పాండ్రంగి వీధిలో జగన్మోహినిగా..

కలెక్టర్‌ను కలిసిన సచివాలయం హెల్త్ సెక్రటరీలు



కలెక్టరేట్ వద్దకు వచ్చిన సచివాలయం హెల్త్ సెక్రటరీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో ఇటీవల జరిగిన సచివాలయ హెల్త్ సెక్రటరీల బదిలీల్లో నిబంధనలు పాటించలేదని, కేవలం రాజకీయ, ఇతర సిఫార్సులకే ప్రాధాన్యత ఇచ్చి బదిలీలు చేశారని, జీఓ 6ను విస్మరించారని సంబంధిత హెల్త్ సెక్రటరీలు ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాంతో కలిసి గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్‌కు విన్నవించారు. శ్రీకాకుళం అర్బన్‌లో పనిచేస్తున్న బి.ఉషారాణికి నిబంధనలకు వ్యతిరేకంగా రూరర్ ప్రాంతమైన పొందూరు మండలం రాపాకకు బదిలీ చేశారని తెలిపారు. అర్బన్‌లో పనిచేస్తున్న కె.విజయకుమారికి శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలేంకి బదిలీ చేశారని, ఎస్.పార్వతి అర్బన్‌లో పనిచేస్తుండగా, ఆమెను లావేరు మండలం అదపాకకు బదిలీ చేశారని తెలిపారు. ఇలా చాలా మందికి నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫర్ చేశారని పేర్కొన్నారు. కేవలం సిఫార్సుల విధానంలో బదిలీలు జరిగాయని ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బదిలీల ఫైల్‌ను అనుమతి కోసం కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చారు. దీంతో కలెక్టర్ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీలు సరిచేసి తీసుకురావాలని ఆమెను కలెక్టర్ ఆదేశించారు.

ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించిన మాదిరిగా మీ ఫోనే.. మీ గన్ అని, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వల్లభరావుపేట, వెంకటరావుపేట గ్రామ పంచాయతీల కార్యకర్తలతో 'కార్యకర్తే కీలకం' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కావడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. సేవే పరమావధిగా భావిస్తూ పనిచేయాలని సూచించారు. కార్యకర్తలందరికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం హామీలు సరిగ్గా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందున 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' పేరుతో కూటమి మేనిఫెస్టో, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ప్రతిఒక్కరూ సమన్వయంతో మెలిగి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు కొత్తకోట్ల పరిసినాయుడు, లక్ష్మునాయుడు, గడి రమణ, మహంతి సత్యనారాయణ, కీర్తి మంగ, పాలూరి బుజ్జి, కొత్తకోట్ల గోవింద, పిల్ల గణపతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇటీవల నియమితులైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

వైభవంగా తిరువీధి



పాత శ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చనలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం తిరువీధి చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికడదాం



జ్యూట్ సంచులను ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ప్లాస్టిక్ కాలుష్యాన్ని కలిసికట్టుగా అరికడదామని.. ప్లాస్టిక్ వద్దు.. జ్యూట్ సంచులే ముద్దని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర అన్నారు. గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో డే అండ్ నైట్ కూడలి వద్ద ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే హానిపై అవగాహన కల్పించి జూట్ సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువ మంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారని, ఇవి భూమి, నదులు, సముద్రాల్లోకి చేరి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని చెప్పారు. అనేక రోగాలకు కారణమవుతున్నాయని తెలిపారు. వీటి వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, సామాజిక సంస్థలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పొన్నాడ రవికుమార్, శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, ఉపాధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, కోశాధికారి బరాటం కృష్ణ చైతన్య, వైస్ ప్రెసిడెంట్ ఉర్లం శివతేజ, సభ్యులు పాడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లావేరులో వంగవీటి రంగా జయంతి వేడుకలు

జి.సిగడాం: లావేరు మండల కేంద్రంలో శుక్రవారం వంగవీటి మోహన్ రంగా 78వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వంగవీటి మోహన రంగా యువసేన సభ్యులు బాలబొమ్మ చిన్న శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద జరిగే వేడుకలకు ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన తెలగ జాతి కుటుంబసభ్యులు హాజరు కావాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): లేబర్ కోడ్‌ల రద్దు, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవడం తదితర డిమాండ్లతో జూలై 9న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, కర్షక సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు ట్రేడ్ యూనియన్ల జిల్లా స్థాయి సమావేశం నగరంలోని క్రాంతి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల మద్దతు ధరలకు చట్టం చేయాలని, రైతులు వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ రైతు పెట్టుబడి సహాయం రూ.20 వేలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు అమలు చేయడం వల్ల కార్మిక వర్గ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం 2 వందల రోజులకు, రోజువారి కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలన్నారు. సెకీ, యాక్సిస్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం, జీడి, కోకో, శనగ, మినుములు తదితర పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలన్నారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల అనుకూల చట్టాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా సమ్మె పురస్కరించుకొని గ్రామ, మండల, డివిజన్ కేంద్రాల్లో నిరసన, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్‌రావు, కె.మోహనరావు, పోలాకి ప్రసాదరావు, పి.తేజేశ్వరరావు, పొందూరు చంద్రరావు, పి.పోలారావు, డి.కృష్ణారావు, సాధు లక్ష్మీనారాయణ, బొత్స సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

జి.సిగడాం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుంటుముక్కల రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.